ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

- ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం
- చర్చా గోష్ఠిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

8

← ప్రసంగిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎండీఎంఏ మత్తులో విద్యార్థులు



మత్తు మందు ప్యాకెట్లు

- బెంగళూరు నుంచి గుంటూరుకు సరఫరా
- 9 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు.. ఇద్దరు పరారీ
- 10.67 గ్రాముల ఎండీఎంఏ సహా, కేజీ గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు

గుంటూరు, ఫిబ్రవరి 18: అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ మత్తు మందుకు విద్యార్థులు బానిసలవుతున్నారు. నిషేధిత మత్తు మందును గుంటూరు కేంద్రంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగేళ్లుగా సరఫరా చేస్తున్నారు. గుంటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ మత్తు మందును సరఫరా చేస్తున్న వారిని, దానికి బానిసలైన విద్యార్థులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ఎం సాయికృష్ణ అనే విద్యార్థి గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడి సోదరుడితో పాటు తెనాలి సమీపంలోని చినరావూరుకి చెందిన ధరావత్ సతీష్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో గతంలో సాయికృష్ణ అనేక సార్లు బెంగళూరు వెళ్లగా అక్కడ సతీష్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సతీష్‌కుమార్ అప్పటికే బెంగళూరుకు చెందిన నితిన్ అనే వ్యక్తితో కలిసి ఎండీఎంఏ మత్తుమందును వినియోగిస్తున్నాడు. దీంతో సతీష్ కుమార్ ద్వారా సాయికృష్ణ కూడా ఆ మత్తుకు బానిసయ్యాడు. ఆ మందును గుంటూరులో విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని నితిన్ సూచించాడు. దీంతో నితిన్ ద్వారా ఆ మందును నాలుగేళ్లుగా సాయికృష్ణ, సతీష్‌కుమార్ గుంటూరు తెచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల కోదండ రామానగర్‌లోని సాయిలక్ష్మీ అపార్ట్మెంట్లో ఉంటూ మత్తు మందును విద్యార్థులకు విక్రయిస్తు న్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డులో ఎక్సైజ్ టూ టౌన్ సీఐ యశోదరాదేవి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుడి పక్కన ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అధికారులను చూసి గాబరాపడుతుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.52 గ్రాముల ఎండీఎంఏ మత్తు మందును వారి వద్ద గుర్తించారు. ఆ మందును అమ్ముకోవడానికి తాము వచ్చినట్లు విచారణలో ఎక్సైజ్ అధికారులకు వారు చెప్పారు. సాయికృష్ణ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఎక్సైజ్ అధికారులు అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టగా 8.15 గ్రాముల మత్తుమందుతోపాటు, కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు లభించాయి. ఫ్లాట్‌లో సాయికృష్ణతో ఉన్న ఏడుగురు విద్యార్థులను కూడా గుర్తించారు. చెరుకుల కృష్ణారెడ్డి(జాకీర్‌హుస్సేన్ నగర్), రాచభత్తుని రాహుల్ (శివనాగరాజుకాలనీ), దొంత ప్రవీణ్ అలియాస్ మమ్మీ(ఆదర్శనగర్), అందే లోకేశ్(పట్టాభిపురం), కొప్పుల ప్రద్యుమ్న(రెడ్డిపాలెం), ములబంటి సాయికృష్ణ(కాజ), ధరావత్ సతీష్‌కుమార్ (చిన్న రావూరు), మద్దిబోయిన దొరస్వామి రాజు(యడ్లపాడు మండలం కొత్త పాలెం), విష్ణుమొలకల చైతన్య (కారంపూడి మండలం లక్ష్మీపురం) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాయికృష్ణ బంధువు వేంపాటి చైతన్య, బెంగళూరుకు చెందిన నితిన్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. ప్రమాదకరమైన మత్తుమందు కేసును ఛేదించిన టూ టౌన్ ఎక్సైజ్ సీఐ ఎం యశోదరాదేవిని డీసీ డాక్టర్ శ్రీనివాసులు అభినందించారు. గత నెలలో కొకైన్ కేసును కూడా సీఐ ఛేదించారన్నారు. ఎస్‌ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతరావు, సీహెచ్ రాజు, షైలా శ్రీనివాసరావు, రవిబాబు, బీఎస్ఎన్ రాజు, పీ నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వీవీ చారి చిన్నబాబు తదితరులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వీ అరుణకుమారి, ఏఈఎస్ ఈడే మారయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రాము రూ.5వేలకు విక్రయం..

బెంగళూరులో ఎండీఎంఏ మత్తుమందును గ్రాము రూ.1400 కొనుగోలు చేసి రూ4,000 నుంచి 5 వేలకు అమ్ముతున్నారు. గుంటూరు సమీపంలోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థులకు ఈ మందును సాయికృష్ణ అలవాటు చేశాడు. గోరంట్లలోని తన ఫ్లాట్‌కి విద్యార్థులను పిలిపించుకుని మత్తు మందును విద్యార్థులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. నాలుగేళ్లుగా సాయికృష్ణ ఈ వ్యాపారం చేస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి తన స్వగ్రామానికి చెందిన సమీప బంధువు ద్వారా విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అత్యంత ప్రమాదకరం

బ్రౌన్‌షుగర్, కొకైన్.. వంటి మత్తు మందులకంటే ఎండీఎంఏ అత్యంత ప్రమాదకరమైందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మత్తు మందుకు బానిసైన వారిలో నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆలోచనలు, విచక్షణ కోల్పోతారన్నారు. ఆకలి, నిద్ర ఉండదన్నారు. ఈ మందుకు బానిసైన వారు నగదు కోసం ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడతారన్నారు.



పల్లెలు.. పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కసరత్తు చేపట్టింది. అయితే వాటర్‌గ్రిడ్ అనుసంధానం అన్ని పట్టణాలకు సాధ్యం కాదని కొన్నింటికే పరిమితం చేస్తూ అధికారులు తేల్చారు. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలు వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం సాధ్యం కాదని తేల్చేశారు. 2058 నాటికి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల పరిధిలోని మున్సిపాల్టీల వారీగా నీటి అవసరాలకు సంబంధించిన నివేదికను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు పబ్లిక్ హెల్త్ అధికారులు అందజేశారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసిన సదరు ఇంజనీర్లు కొన్ని మున్సిపాల్టీలనే వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. గ్రిడ్ వ్యయ అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో సీఎం చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై సమీక్షిస్తారని సదరు అధికారులు తెలిపారు.

వాటర్ గ్రిడ్.. కొన్ని పట్టణాలకే

కొన్ని మున్సిపాలిటీలకే అనుసంధానం

- 2058కి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం
- ఆర్‌డబ్ల్యుఎస్‌కు నివేదిక అందజేసిన పబ్లిక్‌హెల్త్
- గుంటూరు సహా పల్నాడులోని పట్టణాలకు అసాధ్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గ్రిడ్ పథకాన్ని తొలివిడత పల్నాడు జిల్లాలో అమలు చేసేందుకు రూ.1,200 కోట్లతో గతంలో టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. టెండర్ ఆమోదించి పనులు చేపట్టే తరుణంలో మున్సిపాల్టీలకు కూడా ఈ పథకాన్ని అనుసంధానం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేసే అంశంలో గత వారం రోజులుగా జరుగుతున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. ఏమున్సిపాల్టీలకు సాధ్యం.. ఏఏ మున్సిపాల్టీలకు సాధ్యం కాదన్న అంశాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు తేల్చేశారు. ఇందుకు సంబంధించి అంచనా వ్యయం రూపొందిస్తున్నారు. అయితే గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం సాధ్యం కాదని అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, దాచేపల్లి, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల మున్సిపాల్టీలకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.

ప్రకాశం బ్యారేజి వద్ద ప్లాంట్

వాటర్‌గ్రిడ్‌తో అనుసంధానం చేసి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రకాశం బ్యారేజి సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి - తాడేపల్లి, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేయవచ్చని అధికారులు నిర్ధారించారు. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాల్టీలకు నీటిని సరఫరా చేయవచ్చని తేల్చారు. ప్రకాశం బ్యారేజ్ సమీపంలో ఏర్పాటు చేసే నీటి శుద్ధి ప్లాంట్ నుంచి గ్రామాలకు, మున్సి పాల్టీలకు తాగునీటిని సరఫరా చేసే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

ఆ మున్సిపాలిటీల్లో.. అమృత్ 2.0

పల్నాడు జిల్లాలోని గ్రామాలకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు టెండర్ నిర్వహించారు. ఈ పనులు త్వరతగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న తరుణంలో మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం అంశం తెరపైకి వచ్చింది. అయితే పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ సాధ్యం కాదని అధికారులు తేల్చారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథకాలను అమృత్ 2.0 కింద విస్తరించనున్నారు. గుంటూరు కార్పొరేషన్‌కు ఉన్న నీటి పథకాన్ని కూడా అమృత్ కింద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పనులకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే.

మునిసిపాల్టీల వారీగా రానున్న 33 ఏళ్లలో నీటి అవసరాల అంచనా వివరాలు

మునిసిపాల్టీ	ప్రస్తుత నీటి సరఫరా ఎంఎల్‌డీ	2058 నాటికి నీటి అవసరం ఎంఎల్‌డీ
పల్నాడు జిల్లా..		
నరసరావుపేట	22	40.9
చిలకలూరిపేట	16	31.78
వినుకొండ	7	16.94
దాచేపల్లి	2.5	10.99
పిడుగురాళ్ల	9.78	19.63
గురజాల	2	8.74
మాచర్ల	6	17.69
సత్తెనపల్లి	9	17.59
గుంటూరు జిల్లా..		
గుంటూరు	157.2	296.74
మంగళగిరి.. తాడేపల్లి	22.5	98.28
తెనాలి	20	53.87
పొన్నూరు	7.45	18.8
బాపట్ల జిల్లా..		
చీరాల	10	28.07
బాపట్ల	10	24.57
రేపల్లె	4	15.24
అద్దంకి	2.74	13.68

జీబీఎస్‌పై అవగాహన కల్పించాలి

- కలుషిత ఆహారం, తాగునీటితోనే వ్యాధి వ్యాప్తి
- గుంటూరు, ఒంగోలులో ప్రత్యేక చికిత్సా కేంద్రాలు
- కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గులియన్ బ్యారి సిండ్రోమ్(జీబీఎస్) వ్యాధి నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వ్యాధి వ్యాప్తిపై మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లావాసులు వ్యాధిబారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకితే మూడురోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు చచ్చుపడటం, కాళ్ల వేళ్ల నుంచి క్రమేపి స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందన్నారు. గుంటూరు జీజీహెచ్, ఒంగోలు రిమ్స్‌లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యకార్డుపై మంగళగిరిలో ఎయిమ్స్‌లో చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని శుభ్ర పర్చాలని అధికారులను ఆదేశించారు. కాసి వడగట్టి చల్లార్చిన నీటిని తాగాలని ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెరువులలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంక్‌లను పూర్తిగా ఎండబెట్టి క్లోరినేషన్ చేసి తర్వాత నీటిని నింపాలని సూచించారు. డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాలికల హక్కులను పరిరక్షించాలి

బాలికల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. బాలికల హక్కుల పరిరక్షణకు జిల్లా స్థాయిలో కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు. మహిళల పని ప్రదేశాల్లో స్నేహపూర్వక వాతావరణం, సామాజిక భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, గ్రానైట్, టెక్స్‌టైల్స్ ఆక్వా పరిశ్రమలలో కమిటీ తనిఖీలు చూస్తూ 18 సంవత్సరాలలోపు బాలికలు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. పద్నాలుగేళ్ల లోపు బాలికలు బడిలోనే ఉండాలని, వారు ఎట్టి పరిస్థితులలో పనిలో ఉండరాదన్నారు. బాలికల సంరక్షణకు పనిచేస్తున్న సార్డ్, బచ్పన్ బచావ్ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు, కార్మికశాఖాధికారి వెంకటశివప్రసాద్, మహిళా, శిశు సంక్షేమశాఖాధికారి ఉమా, కాలుష్య నియంత్రణమండలి అధికారి, సార్డ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సృజని, బచ్పన్ బచావ్ మేనేజర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణబాబు చెబితే మాకేంటి!

- ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు
- ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలకు పాతర
- పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం
- వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారికి అదే చోట ఉంచారు..

8

కొండవీడు కోట అభివృద్ధికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

6

విద్యార్థులకు.. ముఖహాజరు

బీసీ వసతి గృహాల్లో అమలుకు ఆదేశాలు

- సాంకేతికతతో బోగస్ హాజరు నియంత్రణ
- హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు యాప్‌కు అనుసంధానం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక పోయినా ఉన్నట్లుగా.. వారు భోజనం చేయకపోయినా చేసినట్లుగా.. ఇతర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లుగా.. ఇలా అనేక వసతిగృహాల్లో పెద్దసంఖ్యలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక నుంచి ఇలాంటి అక్రమాలను అడ్డుకు నేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమైంది. బోగస్ హాజరును నివారిస్తే అక్రమాలకు చెక్ పడినట్లేనని ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు ఆదేశించింది. ఈ క్రమంలో తొలుత బీసీ సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ హాజరు నివారణకు నూతన సాంకేతిక విధానం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే అమలు చేసిన ముఖ హాజరు(ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్)ను ఇక నుంచి బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ప్రత్యేక యాప్ ద్వారా నూతన హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా దాదాపు 90శాతం పైగా సరైన హాజరు వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు(3 నుంచి 10వ తరగతి వరకు) 65పైగా, కళాశాల స్థాయి విద్యార్థులకు 36 వరకు హాస్టల్స్ ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 7 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు.



ఫోన్‌లో యాప్ ద్వారా ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

బయోమెట్రిక్‌లోనూ.. బోగస్ హాజరు

బీసీ వసతిగృహాల్లో గతంలో విద్యార్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకున్నారు. ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. అనేక హాస్టళ్లలో బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సైతం బోగస్ హాజరు నమోదు చేసినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. గతంలో విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో బోగస్ హాజరు బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈవిధానాన్ని ఎంపిక చేసిన వసతిగృహాల్లో అమలు చేశారు. అది విజయవంతం కావడంతో అన్ని వసతి గృహాల్లోనూ ఫిబ్రవరి 1 నుంచి అమలు చేస్తున్నారు.

ఇక పక్కాగా లబ్ధి

బీసీ వసతిగృహాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే లబ్ధి పక్కాగా అందనున్నది. ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా తీసిన ఫొటోను ఏపీనివాస్ యాప్‌లో నమోదు చేస్తారు. అందులో విద్యార్థి చదువు, ఎక్కడ నివాసం ఉంటున్నాడు.. తదితర వివరాలు నిక్షిప్తం అవుతాయి. ఈ విధానం ద్వారానే విద్యార్థుల మెస్ బిల్లులు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల ఎటువంటి అక్రమాలకు ఆస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అన్ని బీసీ హాస్టళ్లలో ఈ నెల ఒకటి నుంచి ముఖ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంక్షేమశాఖాధికారి మయూరి తెలిపారు. మెస్ సహా ఇతర అన్ని బిల్లులు దీనికి అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలలోపు హాజరు పూర్తి చేసి వివరాలను వెల్ఫేర్ ఆఫీసర్లు యాప్‌లో అప్‌లోడు చేయాల్సి ఉంటుందన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- ఎమ్మెల్యే జూలకంటితో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరుజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పట్టణంలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు ఎన్నో కష్టాలు పడి నష్టపోయారని, ఆ భయంతోనే కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చి ప్రజలు వైసీపీపై తమ వ్యతిరేకతను నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాశనం చేసిన పోలవరం ప్రాజెక్టును, రాజధాని అమరావతిని గాడిలో పెట్టి పనులు ప్రారంభింపజేశామని, వీటన్నిటి కోసం 75 యేళ్ల వయసులో 25 యేళ్ల కుర్రవాడిగా పనిచేస్తూ సీఎం చంద్రబాబునాయుడు తమకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో తమ పెట్టుబడుల ద్వారా పరిశ్రమలు నెలకొల్పనున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిందని మంత్రి రవికుమార్ అన్నారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ 8 నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమిపై ఎంతో నమ్మకముంచి అఖండ మెజార్టీతో కూటమిని గెలిపించారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను, అప్పులను, విధ్వంసాలను పూర్తిగా గ్రహించడానికి నాలుగు నెలలు పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభకు ముందుగా తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


బంగారు రుద్రాక్షమాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న చంద్ర శ్రీనివాసరావు, చిత్రంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు

త్రికోటేశ్వరునికి రూ.20 లక్షల విలువైన
బంగారు రుద్రాక్షమాల సమర్పణ

చిలకలూరిపేట,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వరునికి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన, హైదారాబాద్ గోకుల్ కన్‌స్ట్రక్షన్ అధినేత చంద్ర శ్రీనివాసరావు రూ. 20 లక్షల విలువైన బంగారు పంచముఖ రుద్రాక్షమాలను మంగళవారం సమర్పించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు సమక్షంలో ఆయన ఆ రుద్రాక్షమాలను ఆలయ కమిటి వారికి అందచేశారు.

రాజకీయ సన్యాసంపై కాసు కట్టుబడి ఉండాలి

- నీతి, విలువలపై ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదం
- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఎన్నికలలో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాటలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కట్టుబడివుండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా గురజాల నియోజకవర్గంలోనూ అరాచకాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని, 1వ తేదీన పింఛన్, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి వుందని, రోడ్లపై గుంతలు పూడ్చలేని స్థితి నుంచి ఇప్పుడిప్పుడే రాష్ట్రం ప్రగతి పట్టాలపైకి ఎక్కుతుందన్నారు. ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో అనేక పెట్టుబడులకు చంద్రబాబుపై వున్న నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాసు మహేష్ రెడ్డికి లేదని, గత మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్లు కూడా వేయనీయకుండా, అధికారుల కళ్లెదుటే నామినేషన్ పత్రాలను చించివేసినా స్పందించని అధికారులు కాసు మహేష్‌రెడ్డి నేడు స్వచ్ఛందంగా 17 మంది కౌన్సిలర్లు పార్టీ మారటంపై మాట్లాడటం సిగ్గుచేటుగా వుందన్నారు. కౌన్సిలర్లే స్వచ్ఛందంగా పార్టీ మారుతున్నట్లు, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో కూడా అధికారులు నిబంధనల ప్రకారమే పని చేశారని, ఆ విధంగానే వీడియోలోనూ ఆధారాలు వున్నాయన్నారు. పిడుగురాళ్ల మునిసిపాలిటీలో అధికార మార్పు, కూటమి ప్రభుత్వంపై జగన్ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే యరపతినేని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి కోసమే కౌన్సిలర్లు టీడీపీలోకి చేరినట్లు స్వచ్ఛందంగా ప్రకటించాక మాట్లాడటం అర్థం పర్థం లేనిదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కూటమి నేతలు, కార్య కర్తలు సంయమనం పాటిస్తూ ఇటువంటి రాజకీయ గొడవలు, అక్రమ కేసులు, దాడులకు పాల్పడటం లేదని తెలిపారు. వైసీపీ హయాంలో పింఛన్లు రాజకీయం చేశారని, పథకాలను తీసివేశారన్నారు. నేడు అలా కాకుండా అర్హులైన వారందరికీ పింఛన్లు, ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. సమావేశంలో పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వున్నం సురేష్, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, దూదేకుల ఖాశింసైదా, చావా రామారావు, ఎల్‌వీఆర్, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం ఆంజనేయులు, మందా డేవిడ్, ఇతర నేతలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పరిశోధనలతో పాటు ఉపాధి అవకాశాలు

- బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తల బృంద సభ్యుల వెల్లడి
- వర్సిటీలో వృక్ష, జంతు, సూక్ష్మజీవ శాస్త్ర విభాగాల సందర్శన


బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్ర విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు అనంతరం బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల్లో పరిశోధనతోపాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆయా సంస్థల శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శంకర్రావు, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ దీప జైశవల్, డాక్టర్ రాజమోహన్ సందర్శించారు. వర్సిటీలోని వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రం, ఫారెస్ట్రీ, జంతుశాస్త్ర విభాగాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. అనంతరం విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జునతో సమావేశమై పశ్చిమ కనుమలు, మడ అడవులలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ఇన్‌చార్జివీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. బయో డైవర్సిటీ నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని గూర్చి తెలియజేశారు. ఈ సమావేశానికి అనుమతి ఇచ్చినందుకు గాను వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డుతో అవగాహన ఒప్పందం చేసుకునేందుకు సూత్రప్రాయంగా అంగికరించారు. కార్యక్రమంలో ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య వెంకట రత్నమ్మ, ఆచార్య ఉమా మహేశ్వరరావు, ఆచార్య ఎస్ఎం ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మిథున్, డాక్టర్ బాలరాజు, డాక్టర్‌విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు కోట అభివృద్ధికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన


నటుడు శివాజీని సత్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కొండవీడుకోట అభివృద్ధి కృషి చేస్తామని, దీనిపై త్వరలోనే సీఎంతో చర్చిస్తానని విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలసి ఆయన కొండవీడుకోటను సందర్శించారు. ముందుగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సినిమా చిత్రీకరణ చేస్తున్న నటుడు శివాజీని, చిత్ర యూనిట్‌ను కలసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఈ ప్రాంతంలో సినిమాల చిత్రీకరణ పెద్ద ఎత్తున జరగాలన్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు.. ఎమ్మెల్యే ప్రత్తిపాటి

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అత్యధిక అవకాశాలున్న ప్రాంతం కొండవీడు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఘాట్‌రోడ్డు నిర్మాణం జరిగిందని, దాంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయన్నారు. . కొండవీడుకోట గొప్పతనం ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ప్రాంతానికి చెందిన నటుడు శివాజీ చారిత్రక కొండవీడుకోటలో చిత్రనిర్మాణం చేపట్టి గుర్తింపు తీసుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మరిన్ని చిత్రాలు ఇక్కడ షూటింగ్ జరుపుకునేలా ప్రోత్సహిస్తామన్నారు.

కొండవీడు విశేషాలు తెలియజేయాలనే.. నటుడు శివాజి

స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు, కొండవీడు విశేషాలను ప్రజలకు తెలియచేసేందుకు ఇక్కడ షూటింగ్ చేస్తున్నట్లు అందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని సినీ నటుడు శివాజీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలపై
నీతి ఆయోగ్ బృందం తనిఖీలు

శావల్యాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు రాష్ట్రంలో అమలవుతున్న తీరును తనిఖీ చేసేందుకు గానూ కేంద్ర నీతి ఆయోగ్ బృందం సభ్యులు మంగళవారం శావల్యాపురం మండలంలోని బొందిలిపాలెం, శానంపూడి గ్రామ పంచాయతీలలో పర్యటించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. బొందిలిపాలెం పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేస్తున్న ఉపాధి పనులను నీతి ఆయోగ్ బృందం సభ్యుడు వికాస్ మాలేకర్ పరిశీలించారు. ఒక్కో కుటుంబానికి ఎన్ని పని దినాలను కల్పిస్తున్నారని, రోజుకు ఎన్ని గంటలు పని చేస్తున్నారని, ఎంత వేతనం తీసుకొంటున్నారని, గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎవరు పర్యవేక్షణ చేస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శానంపూడిలోని సచివాలయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, సామాజిక ఫించన్‌లు, డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న పథకాల అమలు తీరును లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొంటున్న తీరు, కుటుంబ పోషణ తదితర అంశాలను గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్‌ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, గంటవారిపాలెం డీసీచైర్మన్ మండలపు వెంకటనారాయణ, బృంద సభ్యులు సంధ్యారాణి, లక్ష్మీ, భాను, చంద్ర, లోకేష్, సంధ్యారాణి, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రసూల్ పాల్గొన్నారు.


బొందిలిపాలెంలో ఉపాధి కూలీలో మాట్లాడుతున్న బృంద సభ్యులు

హ్యాండ్ బాల్ పోటీల విజేత
తెనాలి ఎన్ఆర్‌కే కళాశాల

పెదకాకాని, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ వాలీ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో తెనాలిలోని ఎన్ఆర్ కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కళాశాల మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల నిలువగా, మూడవ స్థానంలో రేపల్లెలోని ఏబీఆర్ ప్రభుత్వ కళాశాల నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి బి. అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విజేత జట్ల క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి వర్సిటీ ప్రతిష్టను పెంచాలని కోరారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చే యూనివర్సిటీగా ఏఎన్‌యూ ఎదగాలని ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00


విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఆచార్య సుబ్బారావు

బీ ఫార్మసీ పరీక్షలు ప్రారంభం

- కేంద్రాలలో సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు తనిఖీ
- మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీ.ఫార్మసీ 4/4 ఏడవ సెమిస్టర్ (రెగ్యులర్), 3/4 ఆరవ సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు పటిష్ఠ ఏర్పాట్ల మధ్య మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్‌లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో 24 మంది విద్యార్థులకు ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకుగానూ పరిశీలకులను, తనిఖీకి స్క్వాడ్ బృందాలను నియమించామని ఆచార్య సుబ్బారావు తెలిపారు.

జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుంది

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శ

వినుకొండటౌన్ ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు రాకుండా కుంటిసాకులు చెప్పే మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం ఉదయం వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా గుడి వాకింగ్‌ట్రాక్ వద్ద ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూటమి అభ్యర్థి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీకి రాకుండా జైళ్లు పట్టుకొని తిరుగుతున్నాడని అన్నారు. 151 నుంచి 11కి తీసుకువచ్చి ప్రజలు ఎప్పుడో వైసీపీని రోడ్డు మీద నిలబెట్టారన్నారు. జగన్, వైసీపీ నేతల నేర మనస్తత్వాలకు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు మరో ఉదాహణ అని అన్నారు. వంశీ లాంటి డెకాయిట్లు జైల్లో ఉంటేనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు, ప్రజలకు భరోసా ఉంటుందన్నారు. జగన్ సర్టిఫికెట్లిచ్చినంత మాత్రాన హంతకులు రౌడీలు మంచివాళ్లు కారన్నారు. జగన్ తలకిందులుగా తపస్సు చేసినా వచ్చిన రాష్ట్రంలో ఇక వైసీపీ లేవదు, జగన్‌ను జనం నమ్మరని జీవీ స్పష్టం చేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం
ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం 2024 అక్టోబరు, నవంబరులో నిర్వహించిన ఎంఏ తెలుగు 1, 2 ,3 ,4 సెమిస్టర్ పరీక్షల రెగ్యులర్/సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. కోదండపాణి తెలిపారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వివరించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించి, మార్చి 3వ తేదీలోగా పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య వివెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

- ఆఫీసర్స్ క్లబ్ ఆకస్మిక తనిఖీ.. విచారించాలని ఆర్డీవోకు ఆదేశాలు
- జూదం నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరికలు

బాపట్ల,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ పనితీరుపై కలెక్టర్ జె.వెంకటమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లబ్‌ను జూదం గృహంగా మారితే సహించేదిలేదని హెచ్చరించారు. గతంలో అలాంటి పరిస్థితి ఉండేదని ప్రస్తుతం ఆపరిస్థితిలేదని నిర్వాహకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మంగళవారం ఆఫీసర్స్ క్లబ్‌ను అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ క్లబ్‌లోని అన్ని గదులను నిశితంగా పరిశీలించారు. అక్కడి వాతావరణం చూచి పేకాట (రమ్మీ) ఆడుతున్నారని గ్రహించారు. రమ్మీ ఆడకపోతే ఇక్కడ చేతి రాతతో రాసిన కౌంట్ పుస్తకాలు ఎందుకు ఉన్నాయని నిర్వాహకులను ప్రశ్నించారు? అయితే తాము క్యారమ్స్ మాత్రమే ఆడుతున్నారని నిర్వాహకులు కలెక్టర్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. క్లబ్‌లో ఉన్న రమ్మీ ఆడే కౌంటింగ్ పుస్తకాన్ని విసిరేసి కలెక్టర్ సీరియస్ అయ్యారు. రమ్మీ ఆడే పుస్తకాన్ని ఆర్డీవో పి.గ్లోరియాకి వచ్చి విచారణ జరపాలని ఆదేశించారు. గతంలో పరిస్థితి గందరగోళంగా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నిర్వాహకులు మరోసారి కలెక్టర్‌కు వివరిస్తున్న సమయంలో కలెక్టర్ మరింతగా కోపం వ్యక్తం చేశారు. జూదం ఆడితే చూస్తూ ఊరుకుంటామనుకుంటున్నారా.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో ధూమపానం చేయటం వంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొని ఉందని కలెక్టర్ అన్నారు. పోలీసుశాఖ నుంచి వచ్చిన తనకు ఇటువంటి వ్యవహారాలు గురించి తెలియదనుకుంటున్నారని ప్రశ్నించారు? దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పి.గ్లోరియా, మునిసిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, కమిషనర్ రఘునాధరెడ్డి, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 536.80 అడుగులు ఉంది. ఇది 181.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000, ఎడమ కాలువ ద్వారా 8108, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,428 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 32,816 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 13,575 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిర్చి ధరలు ఈ విధంగా ఉన్నాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600
నంబరు. 5	11000	14300
273	10000	12300
341	10000	14000
4884	10000	12800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	13900
బ్యాడిగి	10000	13700
దేవనూరు డీలక్స్	10000	13000
తాలుకాయలు	4000	7000

నేడు పట్టభద్రుల విస్తృత స్థాయి సమావేశం

రేపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పట్టభద్రుల విస్తృత స్థాయి సమావేశం ఉప్పూడి రోడ్డులోని వీరవల్లి ఫంక్షన్ హాలులో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం అనంతరం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు, ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వేమూరు, బాపట్ల శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు జంగా కృష్ణమూర్తి, రేపల్లె టీడీపీ పరిశీలకుడు ఎలినేటి రామస్వామి, హాజరుకానున్నారని, ఈసమావేశానికి రేపల్లె నియోజకవర్గంలోని పట్టభద్రులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి : సీఐ

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగాహన కలిగిఉండాలని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు నేతృత్వంలో బాపట్ల పట్టణ సీఐ రాంబాబు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మార్చిలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు ఉన్నందున ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై చంద్రావతి, కళాశాల ప్రిన్సిపాల్ భవానీదేవి, అధ్యాపకులు విజయలక్ష్మీ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రేణుక, శిరీషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు ఉచితంగా టీకాలు

కొల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మేకలు, గొర్రెలకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలను వేశారు. కొల్లూరు లోని పశు వైద్యశాలలో మంగళవారం 200 మేకలు, 50 గొర్రెలకు ఫాక్స్ టీకాలు అందించారు. జీవాల పోషకులు ఉచితంగా వేసే టీకాలను మూగజీవాలకు వేయించుకోవాలని పశు వైద్యులు యశ్వంత్ సూచించారు. టీకాల పంపిణీ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, జీవాల పోషకులు పాల్గొన్నారు.

నేడు జంపనిలో హిందీ భాషోత్సవం

వేమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భాషోత్సవాలలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాష ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ హిందీ భాష సలహా మండలి సభ్యురాలు తమిరిశ జ్ఞానప్రసూన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమానికి హిందీ భాష ప్రియులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి విద్యార్థి పర్యావరణహిత ఆలోచన చేయాలి

వేమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి తమ గ్రామాలను పర్యావరణ హితంగా ఉంచేందుకు ఆలోచన చేయాలని రాష్ట్ర పర్యావరణ ప్రముఖ పొత్తూరి ఆదిశేషయ్య సూచించారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని భాగ్యమ్మ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణకై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిశేషయ్య మాట్లాడుతూ, ప్రతి గ్రామం పర్యావరణహితంగా ఉన్నప్పుడు దేశం కూడా అదే విధంగా ఉంటుందని, తద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలుతారన్నారు. నీటి వినియోగం ఏ విధంగా ఉండాలి, భవిష్యత్‌లో వచ్చే నీటి ఎద్దడిని ఎలా తట్టుకోవాలి అనే విషయాలను వివరించారు. సదస్సులో ఉపాధ్యాయులు శ్రీనివాసకుమార్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ స్థలాలివ్వాలి : సీపీఐ

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : దరఖాస్తు చేసుకున్న పేద ప్రజల అర్జీలన్ని పరిశీలించి ఇళ్ళస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాపట్ల సీపీఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా నాయకుడు ఏటిగిరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం స్థలాలివ్వాలన్నారు. అదేవిధంగా నిర్మాణ వ్యయం పెరిగినందున రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. కేంద్రబడ్జెట్‌పై వామపక్ష జాతీయ పార్టీల పిలుపుమేరకు ఈనెల 20వ తేదీ వరకు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు జిల్లాలో జాతాలు, ర్యాలీలు, సెమినార్‌లు, బహిరంగ సమావేశాలు, సభలు పెట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, సీహెచ్‌ప్రకాష్‌బాబు, బత్తుల శామ్యూల్, జె.రత్నకుమారి, మేడా వెంకట్రావు, జేబీ శ్రీధర్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

వేమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి వేమూరులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తాడికొండ రమణ (60) అనారోగ్య సమస్యతో బాధపడుతూ మానసిక వేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో రాత్రి 10.30 గంటల సమయంలో తెనాలి నుంచి రేపల్లె వెళుతున్న రైలు కింద పడి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యశాలకు పంపించి దర్యాప్తు చేస్తున్నారు.



ఆలపాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు



ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు

● **వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు**

చుండూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చినపరిమి, మండూరు, మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో సమర్థవంతమైన నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి అత్యధిక ఓట్లు అందించవలసిందిగా కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ఆలపాటి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ కమిటీ పార్టీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, ఎల్లారెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, కుర్రి వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, భీమవరపు శ్రీమాన్, దేవిరెడ్డి నాగేశ్వరరావు, జొన్నకూటి సాంబశివరావు, తియ్యగూర రాఘవరెడ్డి, కేశం శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, దేవరపల్లి అనీల్‌కుమార్, బుచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన వ్యక్తి ఆలపాటి

అమృతలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సమర్థవంతమైన వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు. ఇంటూరు, గోవాడ, అమృతలూరు, పెదపూడి, మూల్పూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, కూచిపూడిలోని సేక్రేడ్ ఆర్ట్ స్కూల్‌లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జరిగిన పరాభవాలను మర్చిపోకూడదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై వారంలో ఒక రోజు మంత్రి లోకేశ్ అన్ని సంఘాల నాయకులతో, ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభ్యర్థి ఆలపాటిని గెలిపించేందుకు అందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వీరి వెంట స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● **ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ**

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో మంగళవారం బాపట్ల ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే నరేంద్రవర్మ కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సజ్జా హేమలత, బాపట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాలనారాయణ, ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందోలులో...

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని చందోలు ఆర్యవైశ్య కల్యాణమండపంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చందోలు గ్రామ పట్టభద్రులందరు తమ ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, బీజేపీ నాయకులు కరీముల్లా, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ రజాక్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పరిమి రామకృష్ణ సాయిబాబు, టీడీపీ నాయకులు ఎస్ఎస్ నియాజి, మండల జనసేన అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, సాధిక్, సోహేల్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చావలిలో...

వేమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కోరుతూ మంగళవారం మండలంలోని చావలి గ్రామంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, జనసేన నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు గోపాల సుబ్బారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పట్టెల దాశరధి, లంకోజి మల్లేశ్వరరావు, గోపాలం శివనాగేశ్వరరావు, జి.సారధి తదితరులు గ్రాడ్యుయేట్ ఓటరు దగ్గరకు వెళ్లి ఆలపాటి విజయాన్ని కోరుతూ బ్యాలెట్ నమూనా పత్రాలు అందజేశారు.



చావలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూటమి శ్రేణులు



కార్యక్రమంలో అంగన్‌వాడీలకు సూచనలు చేస్తున్న డీఈవో పురుషోత్తం

పిల్లల్లో సమగ్ర శిశు అభివృద్ధికి అంగన్‌వాడీలు కృషి చేయాలి

● **జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం**

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో సమగ్ర శిశు అభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు సమర్థవంతంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ హైస్కూల్‌లో వారం రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగే 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రారంభ సంవత్సరాలలో మెదడు అభివృద్ధి, అభ్యాసన, సమగ్రాభివృద్ధి, పిల్లలకు అనుకూలమైన ఆసక్తిని కలిగించే అభ్యాసన సామగ్రి రూపకల్పన, పాఠశాల సంసిద్ధతలను వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఐసీడీఎస్ డీపీవో లక్ష్మీపార్వతి, బాపట్ల మండల విద్యాశాఖాధికారులు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, కోర్సు శిక్షకులు ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎంవీ రాజుపాలెంలో...

కర్లపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు పాఠశాలలకు వెళ్ళటానికి జ్ఞానజ్యోతి 125 రోజుల శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవీ రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరికి 6 రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి అన్నారు. ఎంఈవో విజయశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలందరూ శిక్షణలో పూర్తి అవగాహన పెంచుకొని విద్యార్థులందరిని పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మనోరంజని, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కరరెడ్డి, గుడారంకయ్య, బూర్ల రాజేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం, మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేర్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం సందర్శించి పాఠశాలను పరిశీలించారు. తొలుత ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ బడి భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన భోజనాన్ని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేముల భూపతిరావు, డి.వీరాంజనేయులు, కేర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డిఎల్‌వి.రమణమూర్తి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనంత నగేష్‌బాబుకు ఉత్తమ సేవా పురస్కారం



అనంత నగేష్‌బాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మత్స్యకార సంఘం ఆలిండియా సెక్రటరి జనరల్ అనంతనగేష్ బాబుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. విజయవాడలో మంగళవారం జరిగిన రెండురోజుల డీప్ టెక్నాలజి అండ్ గవర్నమెంట్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అవార్డును అనంతనగేష్‌బాబుకు అందజేసి అభినందించారు. మూడు దశాబ్దాలుగా ఆక్వా రంగంలో అనంత నగేష్‌బాబు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆయనను అభినందించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం పంచాయతీ ఉర్లమ్మతల్లి ఎస్టీ కాలనీలో మంగళవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని సూచించారు. ముందుగా గణపవరం పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నూతన విద్యా విధానంపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

వేమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నూతన విద్యా విధానం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో పెనుమార్పులు తీసుకురావడం జరుగుతుందని, దీనిపై అంగన్‌వాడీలు పూర్తి అవగాహనతో మెలగాల్సిన అవసరం ఉందని రిసోర్స్‌పర్సన్ విశ్వేశ్వరరావు, ముదిగొండ శ్రీరామ్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీలకు జాతీయ నూతన విద్యా విధానంపై జ్ఞానజ్యోతి అనే పేరుతో 120 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆరు రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. వేమూరు, జంపని గ్రామాలలోని ఉన్నత పాఠశాలలో రెండు సెక్టార్లకు సంబంధించిన 50 మంది అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి సూపర్‌వైజర్లు మాధవి, విజయరాణి అధ్యక్షతన వహించారు. మండల విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రెండు విధాలుగా నిర్వహించే 120 రోజుల శిక్షణ అంగన్‌వాడీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, పద్మజ, పలువురు ఉపాధ్యాయులు పలు అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించారు.

జ్ఞానజ్యోతి శిక్షణను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పూర్వ ప్రాథమిక విద్యాశాఖపై జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణకార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు వినియోగించుకోవాలని నిజాంపట్నం మండల విద్యాశాఖాధికారి ఆర్.శోభాచంద్ అన్నారు. నిజాంపట్నంలో మంగళవారం జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో ఆయన కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు 125 రోజుల సర్టిఫికెట్ కోర్సు జరుగుతుందని, ఈ శిక్షణలో అంశాలను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజాంపట్నం మండల విద్యాశాఖాధికారి 2 శేషుగోపాలం, ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, పల్లపట్ల అంగన్‌వాడీ సీడీపీవో అనసూయ, డీఆర్‌పీలు సీహెచ్ గణేష్‌రావు, ఎం.తులసీదాస్, గౌరీ, జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

అభ్యాసన నాణ్యత మెరుగు కోసం శిక్షణ : ఎంఈవో

కొల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అభ్యాసన నాణ్యతను మెరుగుపరచడం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో ప్రారంభించి శిక్షణ ముఖ్య ఉద్దేశ్యాన్ని కార్యకర్తలకు తెలియజేశారు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల మెదడు అభివృద్ధిని విద్యాభ్యాసం ద్వారా ఎలా పెంపొందించాలో శిక్షణలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిదంబరరావు, రిసోర్స్‌పర్సన్స్ సుధాకర్, శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ఫజీరున్నీసా, బి.సాల్మన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా నిలవాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

రేపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : శాసనమండలిలో పట్టభద్రుల స్థానానికి రాజకీయాలకు అతీతంగా ప్రజా గొంతుగా ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా నిలిచి గెలిపించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. రేపల్లె పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ఆమె మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు వై.నవీన్, పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ వై.కిషోర్, నాయకులు బీఎన్‌కే ప్రసాద్, కె.వెంకట్, కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.ఆగస్టీన్, కేవీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కొల్లూరులో ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కొల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హద్దులు దాటి రోడ్డుపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను పంచాయతీ అధికారులు తొలగింపజేశారు. కొల్లూరు దక్షిణపు వీధిలోని కాలేజీ రోడ్డులో ఆక్రమణల వల్ల ప్రజలు ఆ మార్గంలో వెళ్లేందుకు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు అందడంతో పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున రోడ్డుపై ఆక్రమణలను యంత్రాలు, సిబ్బంది సాయంతో మంగళవారం తొలగింపజేశారు. ఇకపై రహదారిపై ఆక్రమణలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు దృష్టిలోపాలు రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

● **కలెక్టర్ జె.వెంకటమురళి**

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులు దృష్టిలోపాలు రాకుండా చిన్నప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలను మంగళవారం ఆయన అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని ఆయన సూచించారు. రక్తహీనతను తగ్గించటానికి ఐరన్‌మాత్రలను విద్యార్థులు తీసుకోవాలన్నారు. కంటికి సంబంధించిన ఎక్సైజ్‌లను కూడా విద్యార్థులు తప్పకుండా చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం 3 వేల మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయటానికి ప్రభుత్వం 7 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలు అమర్చి పుస్తకాన్ని చదివించి చూశారు. కంటి అద్దాలు తీసుకున్న తర్వాత విద్యార్థులకు చదువుకోవటం ఎట్లా ఉందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్పందిస్తూ అద్దాలు పెట్టుకున్న తర్వాత చక్కగా చదువుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి విజయమ్మ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్ళజోళ్ళను పంపిణీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఇల్లు కాలిపోయిన విద్యార్థినికి కలెక్టర్ ఆర్థికసాయం

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. కార్యక్రమంలో అద్దాలు తీసుకోవటానికి వచ్చిన పాఠశాల విద్యార్థిని వెంకట వసంతను కలెక్టర్ ఈరోజు స్కూల్‌కి యూనిఫామ్ వేసుకొని రాలేదు ఎందుకని అడిగారు. వెంటనే విద్యార్థిని బాపట్లలో మేము నివాసం ఉంటున్న ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిందని, వేసుకోవటానికి యూనిఫామ్‌లేదని కలెక్టర్‌కు తెలియజేశారు. దీంతో కలెక్టర్ మనసు చెలించిపోయి విద్యార్థిని వెంకటవసంత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయమ్మ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

నిరుపేదల జీవనోపాధికి పీఎంఈజీపీ రుణాలు మంజూరు చేయాలి

బాపట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల జీవనోపాధి కొరకు పీఎంఈజీపీ రుణాలు విస్తృతంగా మంజూరు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. పీఎంఈజీపీ, పాడి గేదెలు, జీవనోపాధి రుణాల మంజూరుపై సంబంధిత శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి, జీవనోపాదులు పెరుగుతాయన్నారు. పాడిగేదెల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గత ఏడాది రుణ లక్ష్యాలను చేరుకోలేకపోవటం ఏమిటని అధికారులను నిలదీశారు. పీఎంఈజీపీ కింద ఖాది గ్రామీణ పరిశ్రమల బోర్డు కింద 199 యూనిట్‌లు స్థాపించాల్సి ఉండగా కేవలం 72 యూనిట్‌ల మంజూరుపై ఆరా తీశారు. పరిశ్రమల శాఖ ద్వారా రూ.6.64 కోట్ల నిధులతో 207 యూనిట్‌లు స్థాపించాలని లక్ష్యం కాగా కేవలం 91 యూనిట్‌లు మంజూరు చేయటం ఏమిటన్నారు. 442 యూనిట్‌లు రూ.14.97 కోట్లతో ఏర్పాటు చేయాలని లక్ష్యాలలో కనీసం 50శాతం పురోగతి సాధించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ. 6.31 కోట్లతో 179 యూనిట్‌లను స్థాపించటం ఏమిటని ప్రశ్నించారు? వెలుగుసిబ్బంది సక్రమంగా పనిచేయకపోవటంతోనే లక్ష్యాలు చేరుకోవటంలేదని కలెక్టర్ ఆసహనం వ్యక్తం చేశారు. 23 వేల సంఘాలకు రూ.152 కోట్ల శ్రీనిధి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యం పూర్తికాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కేవలం 19,649 సంఘాలకు రూ.136కోట్లు మాత్రమే రుణంగా ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు? పర్యవేక్షణ కొరవడంతోనే జిల్లాలో మొండి బకాయిలు రూ.4.21 కోట్లు నిలిచాయన్నారు. ఒక వెయ్యి యూనిట్‌ల పాడిగేదెలు పంపిణీ చేయాలని లక్ష్యంగా కేవలం 252 యూనిట్‌లు మాత్రమే మహిళలకు మంజూరు చేయటంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పది రోజులలో పురోగతి కనిపించకపోతే సంబంధితాధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ పద్మ, చేనేత జౌళిశాఖ ఏడీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మేలు జాతి పశు సంతతిని పెంపొందించుకోవాలి

● **జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేణుగోపాల్**



లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న వేణుగోపాల్ తదితరులు

కొల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మేలు జాతి పశు సంతతిని పెంపొందించుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండల పరిధి లోని దోనేపూడి గ్రామీణ పశు వైద్యశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మేలు జాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయి దూడల యద ఇంజక్షన్ పశువులకు చేయించి మేలు జాతి పశువులను ఉత్పత్తి చేసుకోవాలన్నారు. తెనాలి డివిజన్ పశు సంవర్ధక శాఖ డీడీ వై.పద్మావతి మాట్లాడుతూ, పశు పోషకులు లేగ దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు నాలుగు, ఎనిమిది నెలల కాలంలో వేయించాలని సూచించారు. వేమూరు అసిస్టెంట్ డైరెక్టర్ కెవి జనార్ధనరావు మాట్లాడుతూ, పాడి పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైద్యాధికారి చలపతిరావు, వైద్యులు యశ్వంత్, శ్రీనివాసరావు, షబీనా సుల్తానా, జేడీవో శ్రీనివాసరావు, షేక్ ఆజాద్, కృష్ణారెడ్డి, సిబ్బంది ప్రసాద్, నాగరాజు, మధుబాబు, సతీష్, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని టీఎం రావు ఉన్నత పాఠశాలలో సిబార్ దంత వైద్యశాల, మాచర్ల వెంకటేశ్వరరావు సంయుక్త సహకారంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు డాక్టర్లు జి.రూపాదేవి, ద్వారకానాథ్‌లు మంగళవారం దంత పరీక్షలు నిర్వహించి పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వి.మల్లికార్జునరావు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు, బీఎఫ్ఎ సభ్యులు డి.శ్రీనివాసరావు, శివప్రసాద్, సిబార్ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షలు సరే.. కళ్లజోళ్లేవి?

● ఉమ్మడి జిల్లాలో 38వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ● 5,186 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కంటి సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీపై ప్రభుత్వం స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది సెప్టెంబరులోనే దాదాపు 38వేల మంది విద్యార్థులకు తొలిదశ కంటి పరీక్షలు పూర్తి అయ్యాయి. అయితే వారిలో కళ్లజోళ్ల అవసరం అయిన విద్యార్థుల డేటా ఇప్పటికే జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రభుత్వానికి సమర్పించినా ఇప్పటి వరకు కళ్లజోళ్ల పంపిణీపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కంటి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు (విద్య),ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో అనేక మంది పౌష్టికాహార లోపం వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారు లకు ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతలో గతేడాది సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు గు ర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్లజోళ్ల అవసరమైన వి ద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వర లో కళ్లజోళ్ల పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యా ర్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొ న్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. 600 మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించారు. వారు సైతం పరీక్షలు నిర్వహించి డేటాను ప్రభుత్వానికి సమర్పించారు.

కంటి సమస్యలకు ప్రధాన కారణాలు

దృష్టి లోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహార లోపం, అంటు వ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికర మైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం కూడా విద్యార్థుల కంటి సమస్యలకు కారణమౌతుందని చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహార లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యు లు చెబుతున్నారు. ప్రాథమిక స్థాయిలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోకుంటే భావిపౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు (పాత చిత్రం)

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులు

ఇండో -ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్

వికసిత్ భారత్‌కు ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వెల్లడి

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత దేశం కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్ తెలిపారు. ప్రపంచంలో భారతదేశ రైతులకు ఒక ప్రత్యేక స్థానం



గుండ్లపల్లిలోని ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ భవనాలను పరిశీలిస్తున్న ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్

ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండో - ఇజ్రాయేలు భవన నిర్మాణాలను పరిశీలించారు. పాలిహౌస్, షేడ్ నెట్, పాలి టన్నెల్ నిర్మాణాలకు స్థలాన్ని పరిశీలించి, నిర్మాణంలో తీసుకోవలసిన చర్యల గురించి ఇంజనీరింగ్, ఉద్యానవన శాఖ అధికారులకు యూరీ రూబీన్ స్టెన్ దిశా నిర్దేశం చేశారు. రూ. 5.06 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాయిల్ వాటర్ ఎనాలసిస్ ప్రయోగశాల, పరిపాలన భవనాలను శిక్షణ పొందే రైతుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ బ్లాక్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రానున్నదని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను రైతులు పండించే అవకాశం కలుగుతుందని యూరీ రూబీన్ స్టెన్ తెలిపారు. విజన్ 2047 అమల్లో భాగంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ముందు చూపుతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేసి అమలు చేస్తున్నారన్నారు. రెండు దేశాల భాగస్వామ్యంతో వ్యవసాయ రంగం కొంత పుంతలు తొక్కే అవకాశం ఉందని, రైతులు సమగ్ర అభివృద్ధి సాధించటానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. స్థానిక రైతులతో కలసి ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి రావటంతో అటు రాష్ట్రానికి, దేశానికి మంచి వ్యవసాయ విజ్ఞాన కేంద్రంగా వెలుగొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన వన శాఖ సీహెచ్‌వీ రమణారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ గుంటూరు జిల్లా ఎస్ఈ జీ బ్రహ్మయ్య, సుబ్బ రాయుడు, ఏపీఎంఐపీ పీడీ వీరాంజనేయులు, టెక్నికల్ అధికారి అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కే పుల్లారావు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

సుస్థిర విద్యతోనే.. సమసమాజ స్థాపన

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుస్థిర విద్యయే సమస మాజ స్థాపనకు శ్రేయస్కరం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వీ రామరాజు అన్నారు. సీపీఆర్ ఈఈసీ సీఎస్ఈ, విప్రోయెర్తెన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బైపాస్ రోడ్డులోని సీఎస్ఈ మీటింగ్ హాల్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సుస్థిర విద్యపై ప్రతి ఒక్క రూ దృష్టి సారించాలని అన్నారు. పాఠశాలల్లో సుస్థిర విద్యా విధానాలపై, నీరు, జీవ వైవిధ్యం, చెత్త యాజమాన్యంపై రాష్ట్ర వ్యాప్తంగా 304 పాఠశాలలకు శిక్షణ ఇవ్వగా 80 పాఠశాలలు తమ ప్రాజెక్టులను సమర్పించాయి. 18 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి రికమండ్ చేయగా అందులో ఏపీ మోడల్, మహానంది (నంద్యాల జిల్లా), ఎంజేపీఏపీ బీసీఆర్, ఈఐఎస్ కలగిరి (అన్నమయ్య జిల్లా) ప్రాజెక్టులు జాతీ యస్థాయికి ఎంపికై రూ.50వేల నగదు బహుమతు లను గెలుచుకున్నాయి. జడ్పీ హెచ్ మల్లవోలు (కృష్ణా జిల్లా), జడ్పీహెచ్, చెట్టుపల్లి (అనకాపల్లి జిల్లా), అరవింద కుంచనపల్లి (గుంటూరు జిల్లా), డాక్టర్ అంబేడ్కర్ గురుకులం వీరపనేని గూడెం (కృష్ణాజిల్లా), డాక్టర్ అంబేడ్కర్ గురుకులం (ఆచంట), పెనుగొండ ప్రాజెక్టులు రూ.10వేల బహుమతులు గెలుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాల అవనిగడ్డ (కృష్ణా జిల్లా), మోడల్ స్కూల్, కారంపూడి గురుకులం, సర్వేపల్లి (నెల్లూరు జిల్లా), డాక్టర్ అంబేడ్కర్ గురుకులం (పల్నాడు జిల్లా), ఆచంట పశ్చిమగోదావరి జిల్లా, అరవింద మోడల్ స్కూల్ మంగళగిరి (గుంటూరు జిల్లా), ఎంజేపీఏ పీబీసీ, ఆర్ఈఐఎస్ సింహాచలం (విశాఖ), శ్రీ గురురాజ ఇంగ్లీషు మీడియం స్కూల్ (నంద్యాల), డాక్టర్ అంబేడ్కర్ గురుకులం జగ్గయ్యపేట (ఎన్టీఆర్ జిల్లా), డాక్టర్ అంబేడ్కర్ గురుకులం నూజివీడు (కృష్ణా జిల్లా) పాఠశాలల మొత్తం 18 బృందాలను అభినం దించి రామరాజు సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి విజయదుర్గ, పలువురు జాయింట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో బెంగుళూరులో జరిగే కార్యక్రమంలో జాతీయ విజేతలైన రెండు బృందాలకు రూ.50వేల నగదు విప్రో సంస్థ బహూకరిస్తుందని ప్రాజెక్టు కోఆర్డినేట్ డైరెక్టర్ వెంకటరత్నం తెలిపారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ

-మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అబద్ధాలను కూడా కాన్ఫిడెంట్‌గా చెప్ప డంలో జగన్మోహన్‌రెడ్డి పీహెచ్‌డీ చేశారని, గన్నవరంలో టీడీపీ కార్యాలయం దాడిపై జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు అనే భ్రమలోంచి ఇకనైనా జగన్ బయటకు రావాలని ఆయన అన్నారు. దళిత ఉద్యోగి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హింసించి, హత్య చేస్తానని బెదిరించిన వైసీపీ నేత వంశీని విజయవాడ జైలులో పరామర్శించిన జగన్, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలు జరిగినప్పుడు ఏం చేశారని నిలదీశారు. ఒక దుర్మార్గుడిని పరామర్శించడానికి జైలుకు వెళ్లిన జగన్మోహన్‌రెడ్డి, అక్కడ కూడా కులాల గురించి మాట్లాడటం నీచాతి నీచమన్నారు. మనిషి అనే వాడు చేయని దుర్మార్గాలు వల్లభనేని వంశీ చేయబట్టే నేడు జైల్లో ఉన్నాడని చెప్పారు. రౌడీలు, గుండాలకు వత్తాసు పలుకుతున్న జగన్, నేరస్థులకు మద్దతిస్తూ పోలీసుల బట్టలు విప్పుతీస్తాం అంటూ మీడియా ముందు రంకెలు వేయడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం ◆ చర్చాగోష్ఠిలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాబడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా కేటాయింపులు జరిగినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్రబడ్జెట్‌పై స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం మేధావులతో చర్చాగోష్ఠి జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుప తిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వలనే కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక కేటాయింపులు సాధ్యమయ్యాయన్నారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అందుకు అనుగుణంగానే బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ప్రధాని మోదీతోనే వికసిత భారత్ సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి రూ.2,50,000 కంటే మించిన ఆదాయంపై పన్ను వసూలు చేసిందన్నారు. మోదీ ప్రభు త్వం 12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను సడలింపు చేసిందన్నారు. దీనివల్ల కేంద్రానికి పన్నుల రూపంలో రూ.1.04 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతున్నా మధ్యతరగతివర్గాల శ్రేయస్సు కోరి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతులకు అండగా ఉండేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం పెం చడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగాలు కాకుండా స్టార్టప్‌ల ద్వారా నిధులు కేటాయిస్తుందని, ఒక్కో యూనిట్‌కు రూ.10 కోట్లకు రుణాలను పెంచినట్లు తెలిపారు. 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య యోజన కింద రైతుల కోసం 1.7 కోట్ల మందితో ప్రయోగాత్మక పథకం ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల రైతుకు విత్తనం నుంచి పంట పండిన తర్వాత మార్కెటింగ్ సదుపాయం కల్పించేంత వరకు కేంద్రం అండగా నిలుస్తుందన్నారు.

అమరావతికి ప్రత్యేక నిధులు..

బడ్జెట్‌లో గత వైసీపీ పాలనలో లేనివిధంగా అమరావతి, పోలవరం ప్రాజెక్టుకి ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. గతంలోనే అమరావతిని స్మార్ట్ సిటీగా ప్రకటించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు దశల వారీగా నిధులు కేటాయించామన్నారు. విశాఖ పోర్టుకి రూ.730 కోట్లు కేటాయింపు చేశారన్నారు. గత 5 ఏళ్లలో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తద్వారా రాష్ట్రాన్ని అనాథాంధ్ర ప్రదేశ్‌గా తయారు చేశారన్నారు. నేడు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి దిశగా ప్రాజెక్టులు, పెట్టుబడులను తీసుకు వస్తున్నారన్నారు. బడ్జెట్‌కి ముందు సీఎం స్వయంగా కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి సమస్యలను వివరించి పెద్దమొత్తంలో నిధులు రాబట్టగలిగారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గళ్లా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జాతీయకౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, చందు సాంబశివరావు, ఈదర శ్రీనివాస్‌రెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, కొక్కెర శ్రీనివాసరావు, పాలపాటి రవికుమార్, కొత్తూరి వెంకట సుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌పై చర్చాగోష్ఠిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, మాధవి తదితరులు

కృష్ణబాబు చెబితే.. మాకేంటి!

● ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు ● ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలకు పాతర ● పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం ● వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారిని అదే చోట ఉంచారు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్ అంటే రోగుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. అటువంటి చోట ఉద్యోగులకు పని ఎక్కువగా ఉంటుంది. అక్కడ పనిచేస్తున్న ఒక ఫార్మసిస్టును తీసుకువచ్చి బొత్తిగా పనిలేని జిల్లా కార్యాలయంలో ఉంచారు. అదేమంటే అప్పట్లో ఎవరో వైసీపీ నేత చెప్పాడని డిప్యూటేషన్ వేసినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మారినా సదరు ఉద్యోగి డిప్యుటేషన్ అంతే కొనసాగుతూనే ఉంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఇలా అక్రమ డిప్యుటేషన్ల దందా నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఆరోగ్యశాఖ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు అంతో ఇంతో మేలు జరుగుతుంది. అధికారులకు మాత్రం అవేవీ పట్టవు. గ్రామాల్లో సిబ్బంది కొరతగా ఉన్నా అక్కడ పనిచేసే వారిని అసలు పనేలేని జిల్లా కార్యాలయంలో నియమిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ప్రిన్సిపల్ సెక్రటరీ చెప్పినా...

వైద్యఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లు రద్దు చేయమని ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లోనే ఈ ఆదేశాలు జిల్లా కార్యాలయానికి అందాయి. అప్పట్లో కొద్ది మందిని జీతం తీసుకుంటున్న ప్రదేశానికి పంపివేశారు. కొంతమందిని మాత్రం వివిధ కారణాలతో డిప్యుటేషన్ వేసిన స్థానంలోనే కొనసాగించారు. జిల్లా కార్యాలయంలో సిబ్బంది కొరత పేరుతో ఆరోగ్య పర్యవేక్షకులను డిప్యుటేషన్లు వేయటం వివాదాస్పద మవుతుంది.

ఎన్నో ఏళ్లుగా అక్కడే...

వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో ఒక హెల్త్ సూపర్వైజర్ పని చేస్తున్నారు. వాస్తవానికి సదరు సూపర్వైజర్ వేరే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీతం తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయన అక్కడే వుంటున్నారు. అదేమనంటే ఇమ్యునైజేషన్ విభాగంలో సిబ్బంది కొరత అని చెబుతున్నారు. ఇదే విభాగంలో మరో సూపర్వైజర్,హెల్త్ అసిస్టెంట్ కూడా పనిచేస్తున్నారు. వీరంతా వేరే చోట జీతాలు తీసుకుంటూ కడుపులో నీళ్లు కదలకుండా జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

వైసీపీ వాళ్లు చెప్పారని...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలామంది ఉద్యోగులు డిప్యుటేషన్ల మీద కొనసాగుతున్నారు. వారంతా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నేతల సిఫార్సు తో అక్కడకు వచ్చిన వారే. ప్రభుత్వం మారినా ఉద్యోగులు మాత్రం అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఉదాహరణకు పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలో అసలు డీఈవో పోస్టు లేదు. అక్కడ ఉన్న వైసీపీ నేత ఒత్తిడితో గుంటూరు అర్బన్‌లో పనిచేస్తున్న ఉద్యోగిని పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నియమించారు. ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేసిన తర్వాత కూడా వాళ్లను యథాస్థానానికి పంపకపోవటం గమనార్హం. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా కొందరు ఉద్యోగులు ఇదే పద్ధతిలో కొనసాగుతున్నారు.



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

పట్టణాలు వదలరు..

ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు సుదీర్ఘ కాలం సర్వీసు పూర్తి చేసినా ఏనాడూ గ్రామీణ ప్రాంతం వెళ్లిన దాఖలాలు లేవు. ఉద్యోగంతో పాటు పట్టణంలో వ్యాపారాలు చేస్తుండటంతో బదిలీ వచ్చినా వెంటనే డిప్యుటేషన్లు వేయించుకుంటున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన హెల్త్ అసిస్టెంట్‌లు రీ డిప్లాయిమెంట్‌లో కూడా అదే జరిగింది. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్‌లు ఒక గ్రూపుగా ఏర్పడి అప్పటి మంత్రి సిఫార్సుతో అనుకూలంగా ఉన్న 40 పోస్టులను బ్లాక్ చేయించారు. సదరు ఉద్యోగులు జాయిన్ అయ్యి 20 సంవత్సరాలు దాటినా పట్టణంలోనే పనిచేస్తూ ఉండటం గమనార్హం. డిప్యుటేషన్ల కోసం జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక లాబీయింగ్ నిరంతరం జరుగుతూనే వుంటుందని వైద్య ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్లపై ఫిర్యాదు చేసేందుకు కొందరు ఉద్యోగులు సిద్ధమయ్యారు.

సాగర్ ఆయకట్టులో వారబందీ అమలుకు నిర్ణయం

కాలువల వారీగా పంటల వివరాలు సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడి కాలువ ఆయకట్టులో వారబందీ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు కాలువల వారీగా పంటల సాగు.. నీటి సరఫరా అంశా లను పరిశీలిస్తున్నారు. నీటి విడుదలపై నియం త్రణ ఏదీ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జలవనరుల శాఖ సీఈ శ్యాం ప్రసాద్ స్పందించారు. గుంటూరు సీఈ కార్యాలయంలో కుడి కాలువ పరిధిలోని ఈఈలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నీటి సరఫరాపై ఆయన సమీక్షించారు. ఏ కాలువ పరిధిలో ఏఏ పంటలు సాగులో ఉన్నాయి. పంటలకు ఎప్పటి వరకు సాగునీరు అవసరం ఉంది అన్న అంశాలపై సీఈ నివేదిక అందజేయాలని కోరారు. నీటి సరఫరాను తగ్గించే అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. కాగా కుడి కాలువకు నీటి సరఫరాపై సమీక్షించేందుకు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సదరు అధికారులు తెలిపారు. సమావేశానికి ఇంజనీర్లు హాజరవుతున్నట్టు చెబుతున్నారు. సమావేశానికి ప్రాజెక్టు కమిటీ.. డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఆహ్వానించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువకు నీటి సరఫరాపై నిర్వహించే సమావేశంలో సదరు కమిటీలను భాగస్వాములను చేయడంలేదన్న వాదన వినిపిస్తోంది.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కొణిజేడులో భూముల రీసర్వే పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల గురించి ఆరా తీశారు. వాటిని ఎలా పరిష్కరిస్తున్నారన్నది. తహసీల్దార్ ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మండలంలోని కొణిజేడుకు వెళ్లారు. అక్కడ భూముల రీసర్వే జరుగుతున్న ప్రాంతాన్ని, రికార్డులను పరిశీలించారు. కొంత మంది రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు.

నాలుగు టిప్పర్లు సీజ్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. యరజర్ల నుంచి గ్రావెల్ తరలిస్తుండగా ఒంగోలు నుంచి పొందురు వెళ్లే రోడ్డులో గనుల శాఖ అధికారులు రాజీనాయుడు, సురేష్‌బాబు తనిఖీలు నిర్వహించి సీజ్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 19నుంచి 22వతేదీ వరకు టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు(డ్రాయింగ్, టైలరింగ్) పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు స్థానిక రామనగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, ఏబీఎం జూనియర్ కళాశాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలన్నారు. హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఇమామ్, మౌజన్లకు రూ.45 కోట్లు విడుదలపై హర్షం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజన్లకు అందాల్సిన గౌరవవేతనాల నిధుల్లో ఆరు నెలలకుగాను రూ. 45 కోట్లు వక్ఫ్‌బోర్డుకు విడుదల చేయాలని టీడీపీ కూటమి ఉత్తర్వులు ఇవ్వడంపై టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పఠాన్ హనీఫ్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇమామ్, మౌజన్లకు శుభవార్త అని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పంగులూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు-తూర్పుకొప్పెరపాడు రోడ్డులో ఎం.సుభాష్ (25) ద్విచక్రవాహనం వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన సుభాష్ ద్విచక్రవాహనంపై వెళ్తూ కొప్పెరపాడు సమీపంలో రోడ్డు మార్జిన్‌లో మంగళవారం రాత్రి మృతిచెంది ఉన్నాడు. వాహనం స్కిడ్ అయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

పీసీపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగమ్మిలో ఈనెల 13న జరిగిన దాడి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. గ్రామానికి చెందిన లెక్కల వెంగళ్‌రెడ్డి, వల్లెం రాజశేఖర్‌రెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తుంది. ఈవివాదాన్ని మనసులో పెట్టు కున్న రాజశేఖర్‌రెడ్డి ఈనెల 13న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వెంగళ్‌రెడ్డి, శబరికంఠారెడ్డిలపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు నిందితులుగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలను మంగళవారం అరెస్ట్‌చేసి కనిగిరి కోర్టులో హాజరుపర్చారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

పామూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎం.ప్రసాద్ అధ్యక్షత వహించారు.

చతికిలబడిన శనగల ధరలు

- ఈ ఏడాది ఎండుతెగులు దెబ్బకు పడిపోతున్న దిగుబడులు
- నేటికీ కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతున్న పాత నిల్వలు
- ఆందోళనలో సాగుదారులు

పర్చూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. తుఫాన్ ప్రభావం, అధిక వర్షాల కారణంగా రబీ సాగులో పైర్లు సకాలంలో వేయలేకపోయారు. కాస్త ఆలస్యంగా శనగను సాగు చేసి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులకు ఎండుతెగులు కుంగదీస్తోంది. దిగుబడి తగ్గడం, ధర దిగజారడంతో వారి ఆశలు అడియాశలుగా మారాయి. మూడేళ్ల నుంచి పండించిన శనగ నిల్వలు చాలా చోట్ల శీతల గిడ్డంగుల్లోనే మూలుగుతున్నాయి. మంచి ధర లభిస్తుందన్న ఆశతో నిల్వ చేసుకున్న రైతులకు పతనమవుతున్న ధర మరింత నైరాశ్యానికి గురిచేస్తోంది.

దిగజారిన జేజే-11 రకం ధర

కొన్ని నెలల కిందట క్వింటా రూ.7200 ఉన్న జేజే-11 రకం ధర ప్రస్తుతం రూ.5500కి పడిపోయింది. దీంతోపాటు కాక్ -11, బోల్డ్‌ల ధర కూడా ఇదేవిధంగా నేల చూపుచూస్తున్నాయి. దీనికితోడు ఈ ఏడాది దిగుబడులు కూడా గణనీయంగా తగ్గాయి. చాలాచోట్ల ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న ధర, దిగుబడులను పరిగణనలోకి తీసుకుంటే కౌలు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదని శగన రైతులు వాపోతున్నారు. .



బోడవాడ సమీపంలో ఎండు తెగులుతో దెబ్బతిన్న శగన పైరు

సబ్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో సుమారు 30వేల ఎకరాల్లో రైతులు శగన పైరును సాగుచేశారు. ఈ ఏడాది శనగకు ఎండు తెగులు వెంటాడడంతో పైర్లు గణనీయంగా దెబ్బతిన్నాయి. పూత దశకు చేరుకున్న తరుణంలో తెగుళ్ల సోకడంతో పైర్లు ఎండిపోయి దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు.

కోల్డ్ స్టోరేజీలకు చేరుతున్న శనగ

ప్రస్తుతం ధరలు దిగజారుతుండడంతో భవిష్యత్తులో మంచి ధర వస్తుందన్న ఆశతో రైతులు శనగ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. మరోపక్క వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు గత్యంతరం లేని రైతులు వచ్చిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.



కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న శనగలు

ప్రజలు లేకుండా ప్రజా వేదిక

- గుట్టుచప్పుడు కాకుండా నిర్వహణపై విమర్శలు
- హాజరుకాని ప్రజాప్రతినిధులు
- అవకతవకలను బయటపెట్టిన ఆడిట్ బృందాలు
- బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో పెద్ద ఎత్తున అవినీతి

బల్లికురవ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ గాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరాలలో జరిగిన పనులకు సంబంధించి మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజలు, ప్రజాప్రతినిధులు లేకుండానే సామాజిక తనిఖీ జరిగింది. ముందుగా ప్రజలకు తెలియజేకుండా, గతంలో జరిగిన అవకతవకలు బయటపడకుండా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్రజావేదిక సభను ఏర్పాటు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి పథక సిబ్బంది మాత్రమే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సభకు బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్టు డెరెక్టర్ విజయలక్ష్మి హాజరయ్యారు. కుర్చీలు ఖాళీగా ఉండడం చూసి ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 2023-24లో రూ.13కోట్లతో జరిగిన 1051 పనులకు సంబంధించి, మెటీరియల్ పనులకు సంబంధించి గత నెల 31 వరకు ఆడిట్ బృందాలు జరిపిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది రూ.15కోట్ల పనులు లక్ష్యంగా గ్రామాలలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ చిరంజీవి, ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీడీ కోటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు కూలీలు తాము పనికి వెళ్లామని కానీ కూలి చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. సామాజిక తనిఖీలో జరిగిన లోపాలపై జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదిక రానుంది.



ప్రజలు, ప్రజాప్రతినిధులు లేకుండానే సిబ్బందితో నిర్వహించిన ప్రజా వేదిక

బయటపడిన అక్రమాలు

- ముక్తేశ్వరం, పలు గ్రామాలలో సంతకాలు లేకుండానే కూలీలకు చెల్లింపులు జరిగాయి.
- 30 నేమ్ బోర్డులు పెట్టకుండానే నగదు డ్రా చేశారు.
- కొత్తూరు గ్రామంలో మస్టర్లపై సంతకాలు లేకుండా వేలిముద్రలు మాత్రమే వేసి ఉన్నాయి. అదే గ్రామంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి 52 రోజులు పని చేసినట్లు రికార్డులో చూపించి, నగదు స్వాహా చేశారు.
- పొరుగు మండలంలో పనిచేసే సచివాలయ ఉద్యోగికి, ఆయన భార్య వలంటీర్‌కు బోగస్ మస్టర్లు వేశారు.
- మల్లాయపాలెంలో ప్రభుత్వ భవనాలను నిర్మించకుండానే నిధులు డ్రా చేశారు.
- కె.రాజుపాలెంలో ఎంబుక్ రికార్డు లేకుండానే పేమెంట్లు చేశారు.
- కొప్పెరపాడు గ్రామంలో పలువురు వలంటీర్లకు మస్టర్లు వేశారు. హార్టికల్చర్‌లో సాగు చేసిన మొక్కలు లేకుండానే నిధులు పక్కదారి పట్టాయి.
- వల్లాపల్లిలో మునగ, జామ మొక్కలు నాటినట్లు డబ్బులు డ్రా చేయగా, ప్రస్తుతం ఒక్క మొక్క కూడా కనిపించడం లేదు.
- అలాగే ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన పంట కాలువను పూడ్చి వేయడంతో నిధులు వృధా అయ్యాయి.
- పలు గ్రామాలలో హార్టికల్చర్ ద్వారా సాగు చేసిన పండ్ల మొక్కలు లేవు.



అవకతవకల గురించి ప్రజావేదికలో వివరిస్తున్న ఆడిట్ బృందం

జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవు..అపోహ మాత్రమే !

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవని, కేవలం అపోహ మాత్రమేనని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. మంగళవారం సంతనూతలపాడు పశువైద్యశాలలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు చెందిన పశుసంవర్ధకశాఖ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పక్క జిల్లాల నుంచి పశువుల దాణా, కోడి గుడ్లు, కోళ్లను ఇక్కడకు రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కోడి గుడ్డు, కోడి మాంసంలో పోషకాహార విలువలు కలవని, ప్రజలు ఎటువంటి సందేహం లేకుండా తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 2,36,500 బాయిలర్ కోళ్లు, అదేవిధంగా రైతుల వద్ద 8,33,434 పెరటికోళ్లు, 1,64,500 గుడ్లుపెట్టే కోళ్లు ఉన్నట్లు ఆమె తెలిపారు. వీటి ద్వారా జిల్లాలో సంవత్సరానికి 3,20,77,800 కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు చెప్పారు. అందువల్ల బర్డ్‌ఫ్లూ లేదని, అపోహ మాత్రమే అనే విషయాన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలిపాలని కోరారు. పశువైద్యుడు ప్రతాప్ ఎరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్‌బాబు, టి.మనురూప్, వై.పేరయ్య, పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కోడి, కోడుగుడ్లను చూపుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి, సిబ్బంది

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడుగుండ్లపాడులో మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ సూచనల మేరకు 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. కాంట్రాక్టుపై పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి ఉదయలక్ష్మి, కార్యదర్శి కొత్తపల్లి మంజేష్, కార్యవర్గ సభ్యులు జానీబాషా, మహేష్, మహబూబ్, బీవీ.రామలక్ష్మి, నాగరాజకుమారి, రమణనాయక్, సుమన్, చినకనయ్య, స్మిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నేతలు

పురుష ఆరోగ్యకార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

మద్దిపాడు, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో గత 22సంవత్సరాల నుంచి పని చేస్తున్న తమను ఉద్యోగాల నుంచి తొలగించారని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాయని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పురుష ఆరోగ్యకార్యకర్తలు మంత్రి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కోరారు. మంగళవారం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురుష ఆరోగ్యకార్యకర్తలు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సేవలు అందించిన తమ వయస్సు 50సంవత్సరాలు దాటిపోయిందని, ఇప్పుడు వేరే పనులు చేయలేకపోతున్నాయని వాపోయారు. తక్షణమే కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతో పురుష ఆరోగ్య కార్యకర్తలు నలుగురు మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు టి.రమణారెడ్డి, ఎస్ఎంఎం.సుభాని, ప్రభాకర్‌రావు, ప్రసాద్, అంజిరెడ్డి, మహేష్, బాబురావు, సుల్తాన్ శ్రీనివాసరావు, కరిముల్లా పాల్గొన్నారు.

నాటుసారాపై సమరభేరి

- నవోదయం 2.0 ప్రారంభం
- నేడు పోలీస్ పేరేడ్ మైదానంలో ప్రారంభించనున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మానవ జీవితాలను కబళిస్తున్న నాటుసారా మహ్మారిని సమూలంగా రూపుమాపేందుకు నవోదయం మలివిడత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రారంభించనుంది. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఒంగోలులోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఎక్సైజ్‌శాఖ శాఖ కొల్లు రవీంద్ర చేతులు మీదగా ప్రారంభం చేయనున్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాలను, మానవాళి శరీరాలలో వచ్చే దుష్ప్రభావాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా నాటుసారా కాసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించి వారి జీవన ప్రమాణాలు పెంచేదుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోనుంది. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న నాటుసారా తాగడం వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 2014-19 మధ్యకాలంలో నవోదయం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వల్ల వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మరో విడత ఈ కార్యక్రమాన్ని మలివిడతగా ప్రారంభించనున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక పోలీస్ పేరేడ్ మైదానంలో మంత్రి కొల్లు రవీంద్ర చేతులు మీదగా నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించనున్నారు.

ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాతో పాటు పలువురు అధికారులు హాజరవుతారని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఎస్‌కే.ఖాజామోహీద్దిన్ తెలిపారు. అదేవిధంగా కళాజాత బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, నగరంలో అవగాహన ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

అవీఇవీ



పృథ్వీరాజ్ (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వరుస రైలు ప్రమాద మరణాలతో ప్రజలు భీతుల్లుతున్నారు. ఇప్పటికే చీరాల ఏరియా వైద్యశాలలో మూడు గుర్తు తెలియని మృతదేహాల ఆధారాలు సేకరించే పనిలో ఉండగా, మంగళవారం మరో వ్యక్తి మరణించాడు. వేటపాలెం మండలం దేశాయిపేటకు చెందిన పావులూరి పృధ్వీరాజు(27) ఓ షోరూమ్‌లో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య అనూష, మూడు నెలల బాబు ఉన్నారు. ఇతను ఉదయం దేశాయిపేట రైల్వే స్టేషన్ సమీపంలో చూడకుండా పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈక్రమంలో కన్నీటిపర్యంతమైన భార్యను చూసిన అందరి కళ్లు చెమర్చాయి.

ఫోన్ పేతో నగదు మాయం?

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ పేలో అల్పాహారం దుకాణ నిర్వాహకుడు నగదు మాయమైన ఘటన మంగళవారం చీరాల వైకుంఠపురంలో చోటుచేసుకుంది. దుకాణ యజమాని మండగిరి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇతను స్థానికంగా టిఫిన్ హోటల్ నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని మహిళ టిఫిన్ చేసి రూ.36 నగదు ఫోన్ పే చేసింది. అయితే కొద్దిసేపటికే అతని అకౌంట్‌లో రూ.450 కట్ అయ్యాయి. అంతేకాకుండా ఫోన్ పే వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అవ్వండి అంటూ టెక్స్ మెసేజ్ చేరింది. దీంతో అవాక్కయిన బాధితుడు వెంటనే బ్యాంకు ప్రతినిధులను కలిసి అకౌంట్ బ్లాక్ చేయించారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇదే తరహా ఘటన ఇటీవల జాండ్రపేటలో కూడా జరిగినట్లు సమాచారం.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు



ప్రతిభావంతులను అభినందిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పవర్ లిఫ్టింగ్ (స్త్రీ, పురుషులు), బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. కాకినాడ జేఎన్‌టీయూ వారి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ కాలేజీ సెలక్షన్స్‌ను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పర్యవేక్షించారు. ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, శ్యామ్ కుమార్, డైరక్టర్ డాక్టరు సుబ్బారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

24న రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల పోటీలు

చినగంజాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసి ఉన్న లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు రాష్ట్ర స్థాయి జూనియర్ ఎడ్ల నాటు బండి పోలురాదా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సోపిరాల గ్రామస్థుల సహకారంతో టైరుబండ్ల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30,116, రెండో బహుమతిగా రూ.25,116, మూడో బహుమతిగా రూ.20,116, నాలుగో బహుమతిగా రూ.15,116, ఐదో బహుమతిగా రూ.10,116, ఆరో బహుమతిగా రూ.7,116, ఏడో బహుమతిగా రూ.6,116, ఎనిమిదో బహుమతిగా రూ.5,116, తొమ్మిదో బహుమతిగా రూ.3,116 అందజేయనున్నట్లు తెలిపారు. బండి తోలే వారు ఆరుగురు మాత్రమే ఉండాలని, బరువు 150 కేజీలు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9133377719, 9704551084, 9063646319 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

తమ్మవరంలో పొట్టేళ్ల పందెలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మవరంలో పొట్టేళ్ల పందేలు మంగళవారం జరిగాయి. తమ్మవరంలోని పొట్టేళ్ల పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కొంతమంది గతంలో మార్టూరు, తదితర ప్రాంతాలకు పోటీలకు వెళ్లేవారని, అదే క్రమంలో తమ్మవరంలో తొలిసారి ఈ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఆలయాల పరిసరాలను పరిశీలించిన సీఐ



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

చినగంజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి, సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వరస్వామి ఆలయాల పరిసరాలను ఇంకొల్లు సీఐ రమణయ్య మంగళవారం పరిశీలించారు. రెండు దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన చర్చించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ భక్తిభావంతో తిరునాళ్లను జరుపుకుంటూ, అశ్లీల నృత్యాలకు తావు లేకుండా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని అన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. స్వామివార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శీలం రమేష్, దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేని వేగవంతం చేయాలి

చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఆదిపూడి(పర్చూరు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమం మందకుడిగా జరుగుతుందని ప్రత్యేక చొరవతో వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సర్వేయర్ ముసలయ్య, తహసీల్దార్ జి.నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ అనిత, సర్వేయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



రీసర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

తగ్గిన ధాన్యం దిగుబడులు

నష్టాల్లో అన్నదాతలు

చినగంజాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం దిగుబడి తగ్గడంతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. సన్నధాన్యం పండించి మంచి లాభాలు ఆర్జించవచ్చునని ఆశించిన రైతుల ఆశలు అవిరి అయ్యాయి. గత ఏడాది నష్టాలు చవిచూసిన రైతులు ఈ ఏడాది అయినా లాభాలు రాకపోతాయా అన్న ధైర్యంతో వరిసాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చేసరికి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు దిగాలుపడ్డారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో గొనసపూడి, కడవకుదురు తదితర గ్రామాలకు చెందిన రైతులు కేఎన్ఎం 1638, 1262, 2782, 1156 రకాల వరి వంగడాలను సాగు చేశారు. సన్నరకం సాగు చేసిన ఎకరం విస్తీర్ణంలో సరాసరిన 25-35 బస్తాలు పండడంతో రైతులు ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. కేఎన్ఎం 1638, 2782 సన్నరకం ధ్యాన్యం 75 కిలోల బస్తా రూ.1500లు, 1262, 1156 రకం ధాన్యం 75కిలోల బస్తా రూ.1400లకు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పంపుతున్నారు. 25 బస్తాలకు రూ.37,500 మాత్రమే వస్తుంది. ఎకరానికి కౌలు, పురుగుమందులు, ఎరువులు, దుక్కి, నాటు, కోత తదితర ఖర్చులకు రూ.35వేల వరకు ఖర్చువుతుందని, వచ్చిన దిగుబడులలో ఖర్చులు పోతే గడ్డిమాత్రమే మిగులుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం 17 శాతం ఉన్న 75కిలోల సన్న రకం బస్తాకు రూ.1730 ఇస్తున్నటికీ ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేయడం వలన రైతులకు మరింత నష్టం వాటిల్లుతుంది. రైతులకు అవగాహన లేకపోవడంతో దళారుల మాయాజాలంతో రైతులు మోసపోతున్నారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర లేక లేకపోవడం, పంట దిగుబడులు తగ్గడం రైతుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఉంటే రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి ఉందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షభావ పరిస్థితులు, సరిగా సాగునీరు రాకపోవడం వలన వేసిన పంటలు సక్రమంగా పండలేదు. ఈ సంవత్సరం వర్షాలు పడి సాగునీరు సమృద్ధిగా ఉండడంతో దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం విచారకరం. గత ప్రభుత్వం రైతుల గురించి పట్టించకోక పోవడం, సాగునీరు సక్రమంగా అందించకపోవడంతో పంటలు అంతంత మాత్రమే పండినాయి. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం పాటుపడటం, సాగునీరు, విత్తనాలు సకాలంలో అందించినప్పటికీ పంట తక్కువగా ఉండడం నష్టాలు కలిగించింది.



ధాన్యాన్ని లోడు చేస్తున్న కూలీలు

పైరు బాగుంది, దిగుబడి తగ్గింది



వరి నాటినప్పటి నుంచి పైరు బాగా ఉందని, వరి పైరుకు కావలసిన మందులు, అన్ని ఎరువులు సకాలంలో వేశామని, చూడడానికి పంట బాగానే ఉందని, దిగుబడి చూస్తే అధ్వానంగా ఉందని అన్నారు.

- ఏకాంబరం ప్రభు, రైతు, కడవకుదురు

ఖరీఫ్‌లో ఈ క్రాప్ చేయాలి



కడవకుదురు, గొనసపూడి ప్రాంతాల్లో వేసిన వరి పైరును ఖరీఫ్‌లో ఈక్రాప్ చేయాలని అన్నారు. రబీలో ఈ క్రాప్ చేయడం వలన వేసిన పంటలు ముందుగా రావడం వలన ప్రభుత్వం ప్రకటించిన ధరకు అమ్ముకోలేకపోతున్నామని అన్నారు.

- నక్కల శ్రీనివాసరావు, రైతు, కడవకుదురు



పాత నేరస్థుల ఇళ్ల వద్ద తనిఖీలు చేస్తున్న డీఎస్పీ మొయిన్

గంజాయి అమ్మితే కఠిన చర్యలు

చీరాల డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా గంజాయి అమ్మినా, కొన్నా, మొక్కలను పెంచినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ హెచ్చరించారు. మంగళవారం ఇంకొల్లులో బండకాలనీ, ఎన్ఎస్ఎల్ నూలు మిల్లు సమీపంలో ఆయన సందర్శించారు. గతంలో గంజాయి కేసులో ముద్దాయిల ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకంపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. అనంతరం ఇంకొల్లు పోలీసుస్టేష్‌లో ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. కేసుల పురోగతికి సంబంధించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గంజాయి నియంత్రణపై నిఘా ఉంచాలన్నారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.రాత్రి వేళ్లలో గస్తీ పెంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జి.సురేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ముమ్మర తనిఖీలు

చీరాలటౌన్ : పాత గంజాయి కేసుల్లోని నేరస్థుల విధివిధానాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఇటీవల చీరాల పరిధిలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. చీరాల రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని పాత నేరస్థులు ఇళ్లల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈనేపథ్యంలో పరిసరాలను అణువణువు క్షుణ్ణంగా పరిశీలించి కౌన్సెలింగ్ చేశారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, కొనుగోలు జోలికి వెళ్లరాదని హెచ్చరించారు. ఎవరైనా అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై అంబటి చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని అనుమానిత ప్రాంతాలలో మంగళవారం పోలీస్‌లు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రధానంగా గంజాయి వినియోగం గురించి ఎస్సైలు ఖాదర్‌బాషా, రవితేజ ఆధ్వర్యంలో రేణింగవరం రోడ్డు, దర్శిరోడ్డు, శింగరకొండ రోడ్డు లతో పాటు పలు శివారు ప్రాంతాలలో తాత్కాలిక గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్న కుటుంబాలతో పాటు మొండితోకపాలెం తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు.



రేణింగవరం రోడ్డులో సంచార కుటుంబాల నివాసాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్సైలు ఖాదర్‌బాషా, రవితేజ

చీరాల డిప్యూటీ ఈవోగా అద్దంకి ఎంఈవో

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల డిప్యూటీ ఈవోగా అద్దంకి ఎంఈవో-1 గంగాధర రావును నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ్‌రామరాజు ఉత్తర్వులు ఇచ్చారు. అద్దంకి ఎంఈవో-1గా పనిచేస్తున్న గంగాధరరావుకు పూర్తి అదనపు బాధ్యతతో చీరాల ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. అటు చీరాల ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా, ఇటు అద్దంకి ఎంఈవో 1గా రెండు విధులను గంగాధరరావు నిర్వహించనున్నారు.



గంగాధరరావు

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- నిబంధనలు ఉల్లంఘించి, ఉపాధి ద్వారా వేసిన సీసీ రోడ్ల నిధులు డ్రా చేసిన వైనం
- ఇప్పటికే చినకొత్తపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు



ఈశ్వరరెడ్డి పంచాయతీ కార్యదర్శి

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి సీసీ రోడ్లకు సంబంధించిన ఉపాధి హామీ నిధులు డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి ఈశ్వర రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేశారు. ఈ పనులకు సంబంధించి టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ 30శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.15,74,283 విలువైన సామగ్రిని సరఫరా చేశారు. అందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3న రూ.15,74,283 ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఈ నిధులను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించాల్సి ఉండగా అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లిక నేరుగా డ్రా చేసి సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించారని మురళీమోహన్‌దాస్ అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మురళీమోహన్‌దాసు మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చీరాల డీఎల్‌పీవో శివనారాయణ డిసెంబరు 18వ తేదీన విచారణ చేపట్టి సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి బ్యాంక్ నుంచి నేరుగా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. 3 నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు వారం కిందట ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి చినకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుత సంతమాగులూరు మండలం పాతమాగులూరు కార్యదర్శి) ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలు శిక్షణ కాలంలో ఆయాలకు సరైన సూచనలు ఇచ్చి కేంద్రాలు సజావుగా సాగేలా చూడాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. మంగళవారం మంగళవారం కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో సింగయ్య సందర్శించి మెనూ ప్రకారం తప్పని సరిగా అందించాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు అంగన్‌వాడీ కేంద్రాలను తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లలో పిల్లలు అందరికీ ఆధార్ కార్డు పొందే విధంగా తల్లులను చైతన్య పరచాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేని వారి వివరాలను మున్సిపల్ కార్యాలయంలో అందించి జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి చేయాలన్నారు. ఆర్పీలు కృష్ణారావు, రమణారెడ్డి, ధనలక్ష్మి, ఇందిరమ్మ, రమాదేవి ప్రీ టెస్ట్ గురించి, అంగన్‌వాడీ కార్యకర్తల రిజిస్ట్రేషన్‌లపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు సందర్శించి పలు సూచనలు చేశారు.

యద్దనపూడి, (మార్టూరు) : జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు 6రోజుల శిక్షణ తరగతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కోర్సు డైరెక్టర్ ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసే ఉద్దేశంతో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ లు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

బల్లికురవ : అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తుందని ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బల్లికురవ, కొప్పెరపాడు ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. ఈ సంటదర్భంగా అయన మాట్లాడుతూ బోధన ఎలాచేయాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అన్న విషయాలను తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు సురేష్, రామకృష్ణ, సూపర్ వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

పర్చూరు : చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం మండల పరిషత్ పాఠశాలలో కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు ప్రారంభించారు. కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు, చిన్నారుల్లో ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని సుభద్ర అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కోర్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

జీబీఎస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గులియన్ బారీ సిండ్రోమ్ వైరస్ రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. కలుషిత ఆహారం, అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జీబీఎస్ వచ్చే అవకాశం ఉందన్నారు. చేతులు, కాళ్లు నిస్సత్తువ, తిమ్మెర్లు వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన, ఉడికిన ఆహారాన్ని తినాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో అన్ని వ్యవసాయ పథకాలు విశిష్ట సంఖ్యతో ముడి పడి ఉందని, ప్రతి రైతు తప్పని సరిగా దానిని పొందాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏవో మాట్లాడారు. రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌తో లింక్ చేసిన ఫోన్‌తో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. కొందరు రైతులు వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారని, ఇప్పుడు సాగు చేయవద్దని, దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు రోజీ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : వ్యవసాయ రంగాన్ని అధునికీకరణ చేయడానికి గుర్తుంపు కార్డులు అందిస్తున్నట్లు ఏడీఏ ధనరాజ్ తెలిపారు. మంగళవారం రావినూతల, ప్రాసంగులపాడు గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ ఆవస్యకతను వివరించారు. మార్చిలో కంది, శనగ తదితర అపరాలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సహాయకులు మౌనిక, రాణి, సుకన్య, మహేష్ పాల్గొన్నారు.

యద్దనపూడి (మార్టూరు) : పీఎం కిసాన్ పథకంతోపాటు ప్రభుత్వ పథకాలు రైతులందరికీ చేరాలనే లక్ష్యంతో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని ఏవో మేరీ మరియమ్మ అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని చిమటావారిపాలెం, వింజనంపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుదర్శన్, లీలాసత్య, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలనివ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాలలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, గుర్రం వెంకట్రావు, తలపనేని అంజయ్య పాల్గొన్నారు.



కొణిదెనలో ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న పీడీ విజయలక్ష్మి

శ్రమశక్తి సంఘాల ద్వారా ఉపాధి పనులు

బల్లికురవ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో కూలీలు వలసలు పోకుండా శ్రమశక్తి సంఘాల ద్వారా పటిష్టంగా ఉపాధి పనులు చేయిస్తామని డ్వామా పీడీ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని కొణిదెన గ్రామంలో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కేటాయిస్తామని, కూలీలు తమకు కేటాయించిన కొలతల మేరకు పనులు చేయాలని పీడీ సూచించారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతెపాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి



ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఆయా గ్రామాలల రైతులు, చిన్నారులు, ఇతర ఆధార్ సమస్యలు ఉన్నవారు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిని శింగయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు భూదార్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ లేకపోవడం అనే సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాంటి వారందరూ ఆధార్ కేంద్రంలో ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కొత్త ఆధార్ తీసుకోవాలని, ఇప్పటికే నలుగురు చిన్నారులకు కొత్త ఆధార్ తీసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన

కావూరివారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న రైతులకు ఆపద్కాలంలో తోడుగా ఉండే ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరమని మండలం కావూరివారిపాలెం వ్యవసాయ సిబ్బంది అన్నారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు స్థానిక నాయకులు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి పథకాలను వివరించారు

పరస్పర దాడుల్లో మహిళకు తీవ్రగాయాలు

విచారణ చేపట్టిన పోలీసులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదం ముదిరి రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, రెండో వర్గంవారు స్వల్పంగా గాయపడ్డారు. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వైకుంఠపురం పరిధిలోని శ్రీరామనగర్‌కు చెందిన కటికల అంజలికి అదే ప్రాంతానికి చెందిన నాగళ్ల వీరబ్రహ్మంకు గతంలోనే ఓ ఇంటి స్థలానికి సంబంధించి వివాదాలు జరిగి, అది కోర్టులో ఉంది. ఇదిలావుండగా అదే ప్రాంతంలోని పక్క వీధిలో అద్దెకు ఉంటున్న అంజలి వదిన అంజమ్మ మంగళవారం ఇల్లు మారుతూ సంబంధిత సామగ్రిని ఓ వాహనంలో తరలించేదుకు సర్దుకుంటుంది. దీంతో ఆ సామగ్రి మావంటూ వీరబ్రహ్మం, బంధువులు అంజమ్మను అడ్డుకున్నారు. దీంతో విషయం పెద్దదయి ఘర్షణ పడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న అంజలి అక్కడికి చేరుకుని వీరబ్రహ్మంతో వాదనకు దిగింది. దీంతో రెండు వర్గాలు దాడులు చేసుకోగా అంజలి తలకు తీవ్ర గాయమవగా, రెండో వర్గానికి చెందిన వారు కూడా గాయపడ్డారు. దీంతో హాస్పిటల్లో చేరి చికిత్స పొందుతుండగా, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజ్యలక్ష్మి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



పాఠశాలకు ఇన్వర్టర్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యతో పాటు వసతులు కల్పిస్తున్నట్లు వేటపాలెం మండలం అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవనం బద్రిరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు ఐటీసీ అనుబంధ సంస్థ ఫినిష్ సొసైటీ చీరాల బ్రాంచి ప్రతినిధులు రూ.40వేలు విలువ గల ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. అందించిన సాయాన్ని వృధాకాకుండా చక్కగా వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసులరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్

ఇంకొల్లు : మండలంలోని గంగవరంలోని వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10వేల విలువైన ఫర్నిచర్‌ను బహూకరించారు. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన వలేటి నాగేశ్వరరావు బొబ్బేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇటీవల గంగవరం హైస్కూల్ వచ్చిన సందర్భంగా పాఠశాలకు సీలింగు ఫ్యాన్లు, కుర్చీలను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.సమత, రిటైర్డు హెచ్‌ఎం కొర్రపాటి వీరాంజనేయులు, వలేటి ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది నాగేశ్వరరావును అభినందించారు.

16న మాలల సాంస్కృతిక కళాజాతర

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మార్చి 16న జరిగే మాలల సాంస్కృతిక కళాజాతర జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు, మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ భవనంలో బాపట్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 16న చీమకుర్తిలో జరగాల్సిన కళా జాతరలన ఒంగోలుకు మార్చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీమోహన్, ఒంగోలు నగర అధ్యక్షుడు పీటర్‌పాల్ పాల్గొన్నారు.